నిర్లక్ష్యం వీడాలి.. సంరక్షణ పెరగాలి

గత, ప్రస్తుత ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం, వనమహోత్సవం లక్ష్యం కొరవడింది. పర్యవేక్షణ కరువై, నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతోంది. మొక్కల సంరక్షణపై పాలకులకు శ్రద్ధ లేక పోవటంతో పనులు ముందుకు సాగడం లేదు. పురపాలక సంఘాలు, పంచాయతీల్లో నర్సరీలను పెంచే బాధ్యతను ప్రస్తుతం డీఆర్డీఏ చూస్తోంది.

– సాక్షి,సిటీబ్యూరో

- హరితహారం, వనమహోత్సవం మొక్కల పెంపకంపై దృష్టి
- ప్రస్తుతం పట్టించుకోకపోవడంతో ఎండుతున్న మొక్కలు
- దయనీయంగా పల్లె, పట్టణ ప్రకృతి వనాలు
- ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలంటున్న ప్రజలు





మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో హరితహారం, వనమహోత్సవాల్లో భాగంగా ఇప్పటి వరకు దాదాపు 5.50 కోట్ల మొక్కలు నాటారు. అధికారిక లెక్కల్లో జియో ట్యాగింగ్ రూపంలో వాటి లెక్కలు కనపడుతున్నాయే తప్పా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా కనబడుతోంది.

నిలువెల్లా నిర్లక్ష్యం..

జిల్లాలో కొన్ని పంచాయతీలు, పురపాలక సంఘాలు మాత్రమే మొక్కల సంరక్షణపై శ్రద్ధ చూపుతుండగా, మరి కొన్ని చోట్ల పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. మొక్కలు నాటే సమయంలో చేస్తున్న పర్యవేక్షణ.. సంరక్షణ చర్యల్లో ఏమాత్రం కనిపించడం లేదనే విమర్శలున్నాయి. నర్సరీల నిర్వహణకు రూ. లక్షల్లో ఖర్చు చేసి మొక్కలు పెంచి, వాటిని సంరక్షించకుండా గాలికి వదిలేయడంతో ప్రజాధనం వృథా అవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మొక్కల పెంపకానికి రోజువారి చెల్లింపులు..

ఒక్కో నర్సరీలో మొక్కల పెంపకానికి కూలీకి రూ. 257లు రోజువారీగా చెల్లిస్తున్నారు. మట్టిని కవర్లలో నింపి విత్తనాలు విత్తేందుకు దాదాపు రూ. 1.20 వెచ్చిస్తున్నారు. ఒక్కో మొక్క నాటేందుకు, పాదులు తీసేందుకు రూ.37 వరకు ఖర్చు చేస్తున్నారు. రక్షణ కంచెకు రూ. 6, నీరు పోసేందుకు రూ.3 కేటాయిస్తున్నారు. ఇంత వ్యయం చేసి మొక్కను బతికించుకోకుంటే నిధులు వృథా అవుతున్నాయి.

పనులకు ఆటంకాలు..

పంచాయతీ, పట్టణాలకు వచ్చే పల్లె, పట్టణ ప్రగతి నిధులు, ఇతర గ్రాంట్స్ 10 శాతం వరకు హరితహారం, వనమహోత్సవాలకు వెచ్చిస్తున్నారు. ఇటు మొక్కలు బతకపోగా అటు పంచాయతీలు, పురపాలికల్లోని నిధుల్లో నుంచి 10 శాతం కోతతో ఇతర అభివృద్ధి పనులకు ఆటంకాలు తప్పడం లేదు.

214 ఎకరాల్లో 102 పల్లె వనాలు..

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాలు, 34 గ్రామ పంచాయతీలు ఉండగా.. వీటి పరిధిలోని 214 ఎకరాల్లో 102 పల్లె, పట్టణ ప్రకృతి వనాలు (పార్కులు) ఏర్పాటు చేశారు.

ఎకరానికి 2,500 మొక్కలు..

ఉపాధి హామీ పథకం కింద నిధులు వెచ్చించి ఎకరానికి 2,500 మొక్కల చొప్పున నాటడం వల్ల చిన్న వృక్షాలుగా అభివృద్ధి చెందాయి. పల్లెలతో పాటు నగరవాసులకు పల్లె,పట్టణ ప్రకృతి వనాలు (పార్కులు) ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుండగా... నిర్వహణలో తలెత్తిన లోపం, నిర్లక్ష్యం కారణంగా పల్లె,పట్టణ ప్రకృతి వనాలు పచ్చదనాన్ని కోల్పోయే పరిస్థితికి చేరుకున్నాయి.

ఎండిపోతున్న మొక్కలు..

పర్యవేక్షణలో కొరవడిన అలసత్వం కారణంగా ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. జిల్లాలో మండలాల వారీగా పల్లె,పట్టణ ప్రకృతి వనాలు ఈ విధంగా ఉన్నాయి.

- శామీర్‌పేట మండలంలో 10 పల్లె ప్రకృతి వనాలు (పార్కులు), ఘట్కేసర్ మండలంలో 18, కీసరలో 9 , మూడు చింతలపల్లి మండలంలో 13, మేడ్చల్‌లో 22 పల్లె ప్రకృతి వనాలు (పార్కులు) ఉన్నాయి.
- 13 పురపాలక సంఘాల్లో 21 పట్టణ ప్రకృతి వనాలు ఉండగా.. పార్కుల నిర్వహణ బాధ్యతలను సంబంధిత పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలతో సహా జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖలు, జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) నిరంతరంగా పర్యవేక్షించాల్సి ఉండగా.. ప్రత్యేక శ్రద్ధ కనబరచడం లేదని విమర్శలున్నాయి.

సంపద వనాలు పరిస్థితి అంతే...

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 5 మండలాల పరిధిలో 8 నుంచి పదెకరాల లోపు ప్రభుత్వ భూముల్లో వెలసిన సంపద వనాల నిర్వహణ కూడా మొక్కుబడిగానే కొనసాగుతోంది. వీటిని కూడా పట్టించుకునేవారే లేకపోవడంతో ఎండలకు వాడిపోతున్నాయి. పచ్చదనానికి తోడుగా పండ్లు ,కలప ,సుగంధ ద్రవ్యాలను ఇచ్చే టేకు, గంధం, నీలగిరి, ఉసిరి, జామ, మామిడి తదితర మొక్కలు పెంపకం ద్వారా ఆర్థిక వనరులను సమకూర్చుకునేందేకు కాచవాని సింగారం, బొమ్మరాసిపేట్, శ్రీరంగవరం, జగన్‌గూడ, చీర్యాలలో సంపదవనాలను పెంచుతున్నారు.

పర్యవేక్షణ లోపం...

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో గ్రామాలు, పట్టణాల మధ్య రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కల సంరక్షణలో కూడా పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. శాఖల మధ్య కొరవడిన సమన్వయంతో మొక్కలకు నీరు అందడం లేదు. దీంతో గ్రామాలు, పట్టణాల మధ్య ఉన్న రహదారులు, రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి.

- జిల్లాలోని మూడుచింతలపల్లి, ఉద్దమర్రి, కేశ్వాపూర్, కేశవరం, అలియాబాద్, మజీద్‌పూర్, ఎదులాబాద్, కొర్రెముల, రావల్‌కోల్, సోమారం, ఎల్లంపేట, శ్రీరంగవరం, బండమాదారం, తిమ్మాయిపల్లి, కీసర, అంకిరెడ్డిపల్లి, యాద్గార్‌పల్లి గ్రామాల్లో మొక్కలకు నీటి నిర్వహణ సరిగ్గా లేకపోవటంతో ఎండిపోతున్నాయి.
- మేడ్చల్, ఘట్కేసర్, దుండిగల్, బోడుప్పల్, నిజాంపేట్, గుండ్లపోచంపల్లి, నాగారం, తూముకుంట, కొంపెల్లి పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో కూడా మొక్కలు వాడిపోతున్నాయి.
- జిల్లాలో 30 నుంచి 40 శాతం మొక్కలు ఎండిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. పంచాయతీలు, పురపాలక సంఘాల్లో ప్రజలు ఎన్నుకున్న పాలక వర్గాల గడువు ముగియడంతో గత కొంతకాలంగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..

ప్రత్యేక అధికారులు మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవటంతో సిబ్బంది వాటిని పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగంతో సహా డీఆర్డీఏ, అటవీ, పంచాయతీశాఖలు, పురపాలక సంఘాలు, సంబంధిత అధికారులు, స్వచ్ఛంధ సంస్థలు ఎండుతున్న మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జవహర్‌నగర్: 11కేవీ సాయిబాబా ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు బాలాజీనగర్ ప్రధాన రహదారి, మహంకాళి రోడ్డు, మోహన్‌రావుకాలనీ, ఆనంద్‌నగర్ కాలనీ, మార్కెట్‌రోడ్డు, శాంతినగర్, ముత్తస్వామి కాలనీ, వేంకటేశ్వరకాలనీ, చంద్రపురి కాలనీ, ఫైరింగ్‌రేంజ్, సిటిజన్ కాలనీ, బీరప్పగడ్డ, లక్ష్మీనర్సింహగుట్ట, వికలాంగులకాలనీ, ఆదర్శనగర్, రేణుకానగర్, సీపీఐకాలనీ, సుష్మితనగర్, చెన్నాపూర్, చిలుకల బిల్డింగ్, అయ్యప్పస్వామి కాలనీ, సాయిబాబా దేవాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్సార్ ఎన్‌క్లేవ్ నూతన కమిటీ



కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సార్ ఎన్‌క్లేవ్ నూతన కమిటీ ఆదివారం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా సోమేష్, ఉపాధ్యక్షులుడిగా రవిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్‌రావు, ట్రెజరర్‌గా ఓంప్రకాష్, జాయింట్ సెక్రటరీగా గురువినోద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాస్‌రావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వెంకటరమణ, శ్రీనివాస్, కొమరయ్య, రాధాకృష్ణ, రిజ్వాన్, అడ్వైజర్లుగా జీవీఎస్ఎస్ శాస్త్రి, శర్మ, సోమయాజులు, నర్సింహ్మారెడ్డి, మధుసూదన్ తదితరులు ఎంపికయ్యారు.

వాలీబాల్‌లో విజేతగా ఏదులాబాద్ జట్టు



ఘట్‌కేసర్: కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ఏదులాబాద్ జట్టు ట్రోఫీని గెలుచుకుంది. గత 4 రోజులుగా కీసరగుట్టలో జరుగుతున్న వాలీబాల్ పోటీల్లో 40 జట్లు పాల్గొనగా ఫైనల్‌మ్యాచ్ ఏదులాబాద్, కొకూర్ జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. ఏదులాబాద్ జట్టు చాకచక్యంగా ఆడి విజయం సాధించింది. రిటైర్డ్ పీఈటీ రమేష్‌రెడ్డి, సీనియర్ కోచ్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారులు బత్తుల శ్రీధర్, బింగి యుగేందర్, యాదయ్య, నాయకులు నాగరాజు, రాజేష్ తదితరులు క్రీడాకారులను అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబాకాలనీలో ఆదివారం ఎస్క్వార్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత హెల్త్‌క్యాంప్‌కు కాలనీవాసుల నుండి విశేష స్పందన లభించింది. ఉచిత హెల్త్‌క్యాంప్‌లో వైద్యులు ఉచితంగా వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, సత్యంసాగర్, సురేష్, ఉపేందర్‌రెడ్డి, మోహన్, వెంకటరామిరెడ్డి, హరిప్రసాద్, సుకృత్, రంజిత్‌కుమార్, రాజిరెడ్డి, హరిప్రసాద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయం

ఘట్‌కేసర్: భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలు అనుసరణీయమని యువజన కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బొమ్మక్ అజయ్ అన్నారు. ఆదివారం ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ×అంబేడ్కర్‌కు పూలమాల₹ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అంబేడ్కర్ అభిమాన సంఘాల ప్రతినిధులు మేకల దాసు, కట్కూరి నర్సింగ్‌రావు, శ్రీనివాస్, మీసార రాజేష్‌కుమార్, తోటకూర రాహుల్‌యాదవ్, మణికాంత్‌రెడ్డి, యుగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు జ్ఞానమాల సమర్పణ

కీసర: అంబేడ్కర్ చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని మేడ్చల్ అసెంబ్లీ బహుజన పార్టీ అధ్యక్షుడు బొడ జంగయ్య అన్నారు. ఆదివారం కీసరలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్‌కు జ్ఞానమాల సమర్పణలో ఆయన పాల్గొన్నారు. నేతలు బక్కని కుమార్, వేణుగోపాల్, గంగి సుధాకర్, శంకరయ్య, కర్రె గణేష్, ఆంజనేయులు, జగన్, యాదగిరి, చిత్రం రవి, రాగుల రమేష్, నర్సింగ్, సాయిలు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



కలెక్టరేట్‌లో శ్రీపాదరావు జయంతి

సాక్షి,సిటీబ్యూరో: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఆదివారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ విద్యార్థులు, జిల్లా యువజన, క్రీడలశాఖ గోపాల్‌రావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

కార్మిక మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్‌కె.మస్తాన్‌బీ



కార్మికులకు హెల్త్‌కార్డులు అందజేస్తున్న దృశ్యం

జవహర్‌నగర్: రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కార్మిక మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్‌కె. మస్తాన్‌బీ అన్నారు. ఆదివారం జవహర్‌నగర్‌లోని మగ్దుంభవన్‌లోని కార్మిక మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్‌కె.మస్తాన్‌బీ ఆధ్వర్యంలో కార్మిక సంక్షేమబోర్డు నుంచి మంజూరైన చెక్కులను కార్మిక కుటుంబాలకు పంపిణీ చేశారు. కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ క్యాంప్ నిర్వహించి హెల్త్‌కార్డులను అందజేశారు. రాష్ట్ర కార్మిక సంఘం ఇన్‌చార్జ్ ఎస్‌కె.మీరా, హెల్త్ క్యాంపు వాలంటీర్స్ విజయ్, నాగరాజు, కార్మికులు నర్సింహ, సుభాష్, బలరామ్, రమేష్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాహుల్‌యాదవ్



మేడ్చల్ : రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా మేడ్చల్‌కు చెందిన మామిండ్ల రాహుల్‌యాదవ్ నియమితులయ్యాడు. మండలంలోని రావల్‌కోల్ గ్రామానికి చెందిన రాహుల్ ఎన్‌ఎస్‌యూఐలో చాలా ఏళ్లుగా క్రియాశీలకంగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పనిచేస్తున్న అతడిని జాతీయ ఎన్‌ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి ప్రతీక్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తనవంతు పోరాటం చేస్తానని రాహుల్‌యాదవ్ స్పష్టం చేశారు.

సీసీరోడ్లకు రూ.99 లక్షలు కేటాయించాం

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ రామంతాపూర్ సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 99 లక్షల నిధులను కేటాయించామని, కార్పొరేటర్ రజిత, నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిధులకు సంబంధించిన పత్రాలను కాలనీవాసులకు అందజేశామని చెప్పారు. టీవీకాలనీ, శ్రీరమణపురం తదితర ప్రాంతాల్లో సీసీరోడ్లు లేకపోవడంతో ప్రజలు రోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా సమస్యలను కార్పొరేటర్‌కు విన్నవించడంతో నిధులు మంజూరు చేయించినట్లు చెప్పారు. టీవీ కాలనీ అధ్యక్షుడు సత్తిరెడ్డి, శ్రీరమణపురం అధ్యక్షుడు యాదగిరి, లూకాస్, రాఘవేందర్, భవానీ, ఉమామహేశ్వర్ రావు, సంతోష్ తదితరులున్నారు.



‘ఆపరేషన్ కగార్ అప్రజాస్వామికం’

జవహర్‌నగర్: ఆపరేషన్ కగార్ అప్రజాస్వామికమని, కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడనాడి వెంటనే కేంద్ర బలగాలను అడవుల్లో నుంచి వెనక్కి పంపించాలని లేదంటే ప్రజాగ్రహం తప్పదని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఆదివారం జవహర్‌నగర్ అంబేడ్కర్ ప్రధాన చౌరస్తాలో పీవోడబ్ల్యూ (విముక్తి) రాష్ట్ర నాయకురాలు సునీత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక విధానాలతో చట్టబద్ధ రాజ్యాంగ వ్యవస్థలను నీరుగారుస్తోందని ఆరోపించారు. ఇఫ్ట్యూ జాతీయ కార్యదర్శి షేక్ షావలీ, నాయకులు కొన్నె వేణు, రషీద్, సింగరాయగౌడ్, యాకస్వామి, చంద్రన్న, ప్రసాద్, రాంరెడ్డి, యాదగిరి, విజయ్, శంకర్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, కండ్లకోయకు చెందిన కిరణ్‌కుమార్(21), అర్కెలగూడెం సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తులో ఉంది.

ఘనంగా కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణతో కట్టమైసమ్మ దేవాలయం



శామీర్‌పేటలో అమ్మవారిని దర్శించుకున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

మేడ్చల్: పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు, అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు.

శామీర్‌పేట్ ఆలయ సందర్శన..

శామీర్‌పేట్: శామీర్‌పేటలోని కట్టమైసమ్మ అమ్మవారిని ఎన్‌ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి ఆదివారం దర్శించుకున్నారు. ఎన్‌ఎస్‌యూఐ జాతీయ కో– ఆర్డినేటర్ జీవన్, లీగల్ కో– ఆర్డినేటర్ అక్బర్, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నాగమధుయాదవ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌స్వామి, ఉపాధ్యక్షుడు రితేష్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాహుల్‌యాదవ్, శామీర్‌పేట మండల అధ్యక్షుడు శ్రీకర్, నాయకులు తదితరులున్నారు.

ఆరోగ్యరన్- 2025 విజయవంతం



ప్రారంభిస్తున్న పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణానికి రాచకొండ రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘ఆరోగ్యరన్–2025’ తోడ్పడుతుందని పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. భాగ్యనగర నందనవనం రిజర్వు ఫారెస్టులో ఆదివారం నిర్వహించిన ఆరోగ్యరన్–2025 ఈవెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై 2కే, 5కే, 10కే ఆరోగ్య రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి, నిర్వాహకులు ప్రభాకర్, నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, నిర్మల, జావీద్‌ఖాన్, నర్సింహ, శ్యామల, కిరణ్‌నాయక్, రమేష్, శంకర్‌రావు, మామిడి శ్రీధర్, ఆరోగ్యరన్ స్పాన్సర్లు ఏపీ కన్‌స్ట్రక్షన్, ది ఆనంద ఆన్ఫినిటీ జాయ్, విజయరత్న స్కూల్, సహస్రం డెవలపర్స్ తదితరులున్నారు.

నిరుద్యోగులపై నిర్లక్ష్యం సరికాదు

కుషాయిగూడ: పాలకులకు నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం తగదని అఖిల భారత యువజన సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు వలి ఉల్లాఖాద్రీ అన్నారు. ఆదివారం ఈసీఐఎల్‌లోని రౌండ్ బిల్డింగ్‌లో జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత రాజకీయాల వైపు మొగ్గు చూపాలని, ప్రస్తుత రాజకీయాలు కుల,మత, ప్రాంతాల పేరుతో సాగుతున్నాయన్నారు. ఈ తరుణంలో యువత రాజకీయాల్లోకి వచ్చి కులమతాలకతీతంగా రాజకీయాలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అదే తీరులో నిరుద్యోగులను మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రచార ఆర్భాటాలకు ఇస్తున్న ప్రాధాన్యత ఉద్యోగాల భర్తీపై చూపకపోవడం బాధకరమన్నారు. కనీసం నిరుద్యోగ భృతిని అమలు చేసి నిరుద్యోగులకు ఊరట కలిగించాలన్నారు. పెద్ద అంబర్‌పేట్ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, శంకర్, లింగం, రవి, సత్యప్రసాద్, వెంకటేశ్వర్లు, యుగంధర్, బాలకృష్ణ, మహేష్, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వలి ఉల్లా ఖాద్రీ

మల్లన్న రాజీనామా చేసి గెలవాలి

పోచారం: కాంగ్రెస్ పార్టీ అండతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిచిన తీన్మార్ మల్లన్న ఓ సామాజిక వర్గాన్ని తీవ్రస్థాయిలో విమర్శించడం సరికాదని పోచారం మున్సిపల్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మెట్టు నర్సింహ్మారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మల్లన్న తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి గెలవాలని సవాల్ విసిరారు. అన్ని సామాజిక వర్గాల సహకారం ఉంటేనే ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు గెలుస్తారన్నారు. కుల రాజకీయాలు ఎప్పటికీ పనికిరావని హితవు పలికారు. ప్రజాప్రతినిధులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఇప్పటికైనా అతడిలో మార్పురాకుంటే రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. రాజకీయ నాయకుడికి క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని, అది ఆయనలో లోపించిందని ఎద్దేవా చేశారు. ఎన్నో అవకాశాలు ఇచ్చిన తర్వాతే పార్టీ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.